ఆర్థికసాయం అందజేత

రాజాపూర్ : మండలంలోని ఈద్గాన్ పల్లి గ్రామపంచాయతీకి చెందిన కుమ్మరి జ్యోతి, కుమ్మరిపెద్ద నారాయణ కుమార్తె జ్యోతి వివాహానికి పార్టీ యు వనేత చించోడ్ అభిమాన్యురెడ్డి రూ. పదివేలు యువసేన సభ్యుల ద్వారా ఆర్థిక సాయాన్ని అందజేశారు. మండలంలోని మోత్కులకుండ తండా గ్రామ పంచా యతీలోని వాచ్యతండాకి చెందిన జాటావత్ దేవ్‌సింగ్ కుమార్తె మంజుల వివా హానికి రూ. పదివేలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో అభిమాన్యు యువ సేన నాయకులు బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు కాగుల రాములుయాదవ్ సర్పంచ్ అలివేలుశ్రీనివాస్, నరేందర్‌రెడ్డి, రైతుబంధు గ్రామ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, బీసీసెల్ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు జనిగేల శేఖర్‌యాదవ్, రాఘ వేందర్, మాజీ గ్రామ అధ్యక్షుడు ధరమోని బాలయ్యయాదవ్, 5వ వార్డ్ సభ్యులు గోర శ్రీనివాస్‌గౌడ్, గ్రామ రైతుబంధు ప్రధాన కార్యదర్శి బండారినర్సింహ, గ్రామ అధ్యక్షుడు ధరమోని మల్లేష్‌యాదవ్, యువ నాయకులు రాముయాదవ్, శేఖర్, గోపాల్, సర్పంచ్ సభవాట్ రవినాయక్, వార్డ్‌మెంబర్ బాలిశ్వర్, బిచ్చు నాయక్, రాందాస్‌నాయక్, హతిరాంనాయక్, శ్రీకాంత్‌నాయక్ పాల్గొన్నారు.



తారకరత్నకు ఘన నివాళి

నవతెలంగాణ-కోడేరు

మండలంలో నందమూరి తారకరత్నకి టీడీపీ మండల అధ్యక్షుడు ఓర్సు రామకృష్ణ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణంలో ఘన నివాళులర్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తారకరత్న అకాల మరణం యావత్ తెలుగు రాష్ట్రాల్లో అభిమానులకు తీరని బాధను మిగిల్చారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామయువకులు, అభిమానులు పాల్గొన్నారు.



చివరి ఆయకట్టు ఎండిపోతున్నది..

- జూరాల కాల్వల లైనింగ్ ధ్వంసం
- సమీప పొలాలకు కొనసాగుతున్న వారబంది
- మోటార్ల ద్వారా నీటిని తరలిస్తున్న రైతులు
- సింగోటం ద్వారా గోపాల్‌దిన్నెకు కెనాల్ అయితేనే చివరి ఆయకట్టుకు నీరు



నవ తెలంగాణ- మహబూబ్నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాకు వరప్రదాయినిగా ఉన్న జూరాల ప్రాజెక్టు చివరి ఆయకట్టు ఎండిపోతున్నది. జూరాల నుంచి ఎడమకాల్వ ద్వారా గోపాల్ దిన్నే వరకు ప్రధాన కాల్వ ఉంది. కాల్వలు ఉన్నప్పటికీ మరమ్మతులు లేక చివరి ఆయకట్టుకు సాగునీరందడం లేదు. జూరాల మొదలుకొని గోపాల్‌దిన్నే వరకు వేలాది మోటర్లు వేసుకుని రైతులు నీటిని తరలిస్తున్నారు. అక్రమంగా నీటిని తరలించడం ద్వారా స్టిరీకరించి నాయకత్వకు సాగునీరు లేకుండా పోతుంది. అక్రమంగా మోటార్లు పెట్టి నీటిని తరలిస్తున్న రైతులను నియంత్రించడం లేదు. ప్రధానంగా కాలువలకు మరమ్మతులు లేకపోవడం వల్ల మీరంతా వృథాగా పోతున్నది. లైనింగ్ ధ్వంసమైంది. దీంతో చాలా చోట్ల కాల్వకు అడ్డంగా రాళ్ల వేసి నీటిని తరలిస్తున్నారు. ఒకవైపు అధికారులు వారబంది పెట్టడంతో ఎండిపోతున్న పంటలు మరోవైపు నీటిని అక్రమంగా తరలించడంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. కాల్వలనుంచి వృథా అవుతున్న నీటిని అరికట్టడం లేదు. కాల్వల పూడిక తీయడం లేదు. ఎత్తు లేకపోవడంతో నీరు కట్టల పైనుంచి పారుతుంది. షట్టర్లు సరిగ్గా బిగించకపోవడంతో వృథావుతుంది. ముఖ్యంగా నిర్వహణకోసం వేసిన రోడ్లను ధ్వంసం చేయడంతో కాల్వల ప్రమాద స్థాయికి చేరాయి. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పరిస్థితి మరి దారుణంగా మారింది. గౌరీదేవిపల్లి, జొన్నలబగుడా నుంచి వచ్చే కాల్వల నీరు చివరి ఆయకట్టుకు చేరడం లేదు. అచ్చంపేట, వంగూరు, చారగొండ, మాడుగుల, ఆమనగల్, తలకొండపల్లి గ్రామాలకు చుక్కనీరు రావడం లేదు. కాల్వలు ఉన్నప్పటికీ ఈ ప్రాంత పంటపొలాలు బిల్లుగా మారుతున్నాయి. ప్రధాన కాల్వల నుంచి వచ్చిన నీరు రిజర్వాయర్లు నిండిన తర్వాత దుందుభి నదిలోకి వదులుతున్నారు. తాడూరు, గుంతకోడూరు మధ్యలో ఉన్న చిన్న కాల్వ ద్వారా వచ్చే నీరునెలకుదురు ఆవంచ వద్ద నీరువృథాగా పోతుంది. అధికారులు స్పందించి వృథాగా దుందుభీ వాగులోకి వెళ్లకుండా నివారిస్తే వందల ఎకరాలకు సాగు నీరు అందుతుంది.

కృష్ణ తుంగభద్ర నదులు పొంగిపొర్లుతున్న ఇక్కడ మాత్రం సాగు నీటి కోసం వారబంది తప్పడం లేదు. వందల టీఎంసీల నీళ్లు వచ్చి సముద్రంలో చేరుతున్న సమీప పంట పొలాలకు సాగునీరు ఇవ్వలేని దయనీయస్థితి మన పాలకులది. జూరాల కల్వకుర్తి ప్రాజెక్ట్ కింద ఉన్న చివరిఆయకట్టు అయిన వీపనగండ్ల, చిన్నంబావి, తలకొండపల్లి, మాద్గుల, ఆమనగల్, కద్తాల మండలాలకు సాగునీరు లేక పంట పొలాలు బీల్లుగా మారాయి. అక్రమంగా నీటి వాడకం కాల్వ మరమ్మతుల నిర్వహణలోపంతో ఇక్కడి పంట పొలాలకు సాగునీరు అందడం లేదని ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి. సింగూటం నుంచి గోపాల్‌దిన్నే వరకు కెనాల్ ఏర్పాటు ద్వారా సాగునీరు అందించాలని పలు పార్టీల ప్రజా సంఘాలు కోరుతున్నాయి.



ఎండుతున్న పంట పొలాలు

జూరాల కల్వకుర్తి ప్రాజెక్టుల పరిధిలో ఉన్న చివరి ఆయకట్టు ఎండిపో తుంది. ముఖ్యంగా జూరాల చివరి ఆయకట్టైనా చిన్నంబావి, వీపనగండ్ల పంట పొలాలు ఎండిపోతున్నాయి. పెసర వేరుశనగ, మొక్కజొన్న పంటలు అధికంగా సాగుచేశారు. నీటి సరఫరా ఆగిపోవడంతో రైతులు బోరు మోటర్ల మీద ఆధారపడి వ్యవసాయాన్ని సాగు చేస్తున్నారు. ఈ ప్రాంత పంట పొలాలకు సాగునీరు అందివ్వాలంటే... ప్రధానంగా సింగోటం నుంచి గోపాల్ దిన్నె వరకు కల్వకుర్తిఎత్తిపోతల పథకం నీటిని అందివ్వాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. కాల్వ కోసం ఇప్పటికే నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. ఈ కాల్వను పూర్తిచేస్తే జూరాల చివరి ఆయకట్టు సాగునీరు సమస్య తీరుతుంది. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీటిని సాగు భూ ములకు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. రిజ ర్వాయర్లు నిండిన తర్వాత చివరాయకట్టు సాగుపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. ఎత్తు ప్రాంతం కావడం చేత నీరు వెళ్లడంలేదని సాకులు వెతుకుతు న్నా రు. ముందు సర్వే చేసి కాల్వలు తవ్విన తర్వాత ఎత్తు అనే సమస్య ఉండదు. ఈ ప్రాంత ప్రజలు వేరుశెనగ, మొక్కజొన్న, వరి పంటలను ప్రధానంగా సాగు చేశారు. నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లాల పరిధిలో సుమారు ఐదు లక్షల ఎకరాల పైగా వివిధ రకాల పంటలను సాగు చేశారు. ఈ పంటలన్నీ జూరాల, కల్వకుర్తి ప్రాజెక్టల మీద ఆధారపడి సాగయింది. అధికారుల వైఫల్యంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందే పరిస్థితులు లేకుండాపోయాయి. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం చివరి ఆయకట్టుకు సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలని పలు రైతు సంఘాలు కోరుతున్నాయి.

తమ పంట పొలాలకు సాగునీరు ఏది



తనకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ పొలంలో మినుము, వేరుశనగ వంటి పంటలు సాగు చేస్తాను. వర్షాకాలం వస్తే అతివృష్టితో వేసవిలో అయితే నీరులేక పంటలు ఎండిపోతున్నాయి. పదియేండ్లుగా రబీలో ఏనాడు కూడా జూరాల నీరు రాలేదు. ఎగువన ఉన్న పంటలే సాగవుతున్నాయి. తమ పంటపొలాలకు మాత్రం సాగునీరు రావడం లేదు. చివరిఆయకట్టుకు సాగునీరు అందించాలంటే సింగోటం రిజర్వాయర్ నుంచి నీటిని తరలించాలి.

-బాలయ్య రైతు, చిన్నంబావి

సింగోటం రిజర్వాయర్ నుండి నీటిని తరలించాలి



జూరాల చివరి ఆయకట్టు సమస్య ఏటా ఉంటుంది. ఇప్పటికే వా రబంది పేరుతో వారానికి ఒకసారి నీటిని వదులుతున్నారు. ఎండాకాలం ముదురడంతో వచ్చే నీరు చివరి పంట పొలాలకు అందడం లేదు. కాల్వల మరమ్మతులు లైనింగ్‌ను ఏర్పాటు చేయకపోవడంతో చివరాయకట్టు సాగు సమస్యగా మారింది. ముఖ్యంగా వేలాది మోటార్ల ద్వారా రైతులు సాగు నీటిని తరలించడంతో సాగునీరు అందడం లేదు. ఇప్పటికైనా కాల్వల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి పంట పొలాలకు సాగునీరు అందిం చేలా చర్యలు తీసుకోవాలి.

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, వనపర్తి

ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలం

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌లో ఉన్న సారిక టౌన్షిప్, పోతులమడుగు టౌన్ షిప్ లలోని ఓపెన్ ప్లాట్లకు మార్చి16 నుంచి 18 వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు కలెక్టర్ జి. రవి నాయక్ తెలిపారు. అమిస్తాపూర్‌లోని సారిక టౌన్‌షిప్‌లో ఉన్న 96 ప్లాట్లకు మార్చి 17, 18 తేదీలలో మహబూబ్‌నగర్‌లోని బాదంసరోజిని ఆడిటోరియంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్లాట్లు 60 చదరపు గజాలు మొదలుకొని, 266 చదరపు గజాల వరకు ఉన్నాయని, వీటికి కనీస ధర రూ.7 వేల నుంచి 8 వేలు నిర్ణయిం చినట్లు తెలిపారు. పోతులమడుగులో ఉన్న 160 ఓపెన్ ప్లాట్లకు మార్చి16, 17, 18 తేదీలలో మహబూబ్‌నగర్‌లోని బాదం సరోజిని ఆడిటోరియంలో బహి రంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోతులమడుగు టౌన్షిప్ లో ఉన్న ప్లాట్లు 140 చదరపు గజాలు మొదలుకొని 400 చదరపు గజాలు వరకు ఉన్నాయని, వీటికి కనీస ధర రూ.5500 నుంచి 6000 ల వరకు నిర్ణయించినట్లు వెల్లడించారు. ఈ రెండు సైట్లలో ని ప్లాట్లకు సంబంధించి మార్చి 7 న సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ప్రీ- బిడ్ మీటింగ్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ ప్లాట్లకు నిర్వహించే బహిరంగ వేలంలో పాల్గొనేవారు ధరావత్తు కింద పదివేలు చెల్లించాలని కలెక్టర్ సూచించారు.

పంట మొత్తాన్ని కొనుగోలు చేయాలి



నవ తెలంగాణ- అలంపూర్

రైతులు సాగు చేసిన పప్పు శనగ మొత్తాన్ని ఎలాంటి నిబంధనలు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం గద్వాల జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న డిమాండ్ చేశారు. బుధవారం మండల పరిధిలోని క్యాతూర్ గ్రామ రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఎకరాకు కేవలం 5 క్వింటాల 20 కేజీల పప్పు శనగ మాత్రమే కొనుగోలు చేస్తోందని, రైతులు మిగిలిన పప్పు శనగను అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ ఏడాది ఎకరాకు 8 నుంచి 11 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చిందని అన్నారు. రైతులు పండించిన పప్పు శనగ పంటను మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులను సమీకరించి ప్రతి గింజను కొనే వరకు ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ రైతులు సత్యం రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, నరసిం హ, షేక్ హుస్సేన్, సుధాకర్, హరి తదితరులు ఉన్నారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి



నవతెలంగాణ- వంగూరు

మహిళా సంఘాలు శ్రీనిధి రుణాలను సకాలంలో చెల్లించాలని ఐఓబీ బ్యాంక్ ఎల్‌డీఎం కౌశల్ కిషోర్ పాండే, డీపీఎం అరుణ సూచించారు. బుధవారం మండలంలోని ఐఓబీ బ్యాంక్ నుంచి మంజూరైన రుణాలను తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిం చారా లేదా అని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ అవసరాల కోసం తీసుకొని మళ్లీ రుణాలను చెల్లించి ఎక్కువ పెద్ద మొత్తంలో తీసుకోవాలని వారు కోరారు. తూచా తప్పకుండా కట్టిన వారికి మరల రూ. 30 లక్షలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ సురేంద్ర, చంద్రాకర్, ఏపీఎం చంద్రయ్య, సీసీలు నిర్మల, రామస్వామి, శంకర్ తదితరులు ఉన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

నవ తెలంగాణ- అలంపూర్

మండల కేంద్రంలో సీఐటీయూ మండల కన్వీనింగ్ కమిటీ సమావేశాన్ని బుధవారం కెవిపిఎస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బి.నరసింహ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ మాట్లాడుతూ.. ఐసిడీస్ సెంటర్లకు కేంద్ర ప్రభుత్వం 90శాతం నిధులు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పౌష్టికాహారం నిధుల్లో కోత పెట్టడంతో మాత శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. గుజరాత్ రాష్ట్రంలో ఇస్తున్నట్లు గ్రాట్యుటీ తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశావర్కర్లకు పారితోషికాలు కాకుండా కనీస వేతనం రూ. 26 వేల ఇవ్వాలని, అంత వరకు ఆంధ్రలో ఇస్తున్నట్లు ఫిక్స్‌వేతనం రూ. 10వేలు అమలు చేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన ఎరియర్స్ నిధులు విడుదల చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు అసెంబ్లీలో చెప్పిన విధంగా రూ. 3 వేలు ఇవ్వాలని, రిటైర్డ్ బెన్ఫిట్స్ 5లక్షలు, 3లక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీవర్కర్లు శాంతమ్మ, టి.లక్ష్మి, కాంతమ్మ, రూప, ప్రియ, ఆశావర్కర్లు పద్మావతి, నాగేశ్వరమ్మ, ఆంజనమ్మ, మధ్యాహ్న భోజన కార్మికులు మసూంబి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీల ఆడిట్ పేరాలకు చర్యలు



నవ తెలంగాణ - మహబూబ్ నగర్

జిల్లాలో సామాజిక తనిఖీల ఆడిట్ పేరాలకు సంబంధించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ జీ. రవి నాయక్, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానీయాకు తెలియజేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 373 సోషల్ ఆడిట్ ప్యారాలకు గాను 77 క్లోజ్ చేయడం జరిగిందని అన్నారు. మిగితావి వివిధ దశలలో ఉన్నాయని పేర్కొన్నారు. వాటిపై చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. బుధవారం సామాజిక తనిఖీల ఆడిట్ పేరాలు, స్త్రీనిధి రుణాల రికవరీపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఆర్డీఓలతో సామాజిక తనిఖీ, అదేవిధంగా స్త్రీనిధి రుణాల రికవరీపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా జిల్లాలలో సామాజిక తనిఖీల సందర్భంగా సమర్పించిన ఆడిట్ పారాలకు సంబంధించి పూర్తి ఆధారాలు సమర్పించాలని కోరారు. స్త్రీనిధి కింద రికవరీ చేసే రుణాల శాతాన్ని పెంచాలన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ హనుమంతరావు రాష్ట్రస్థాయి నుంచి ఈ వీసీ లో పాల్గొనగా, జిల్లా నుంచి రెవెన్యూ అదనపు కలెక్టర్ కె .సీతారామారావు, డీఆర్డీఓ యాదయ్య, అడిషనల్ పీడీ శారద, స్త్రీనిధి మేనేజర్ సాయిప్రసాద్ తదితరులు హాజరయ్యారు.

ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి



నవతెలంగాణ- హన్వాడ

తెలంగాణ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండల పరిధిలోని షేక్‌పల్లిలో బీజేపీ భరోసా కార్యక్రమం మండల అధ్యక్షుడు డాక్టర్ వెంకటయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.. కార్యకర్తలు గ్రామాల్లో కలిసికట్టుగా ఉండి పనిచేయాలని సూచించారు. ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వివరించాలని సూచించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలలో భరోసా కల్పించాలని సూచించారు. మండలంలో అన్ని గ్రామాల్లో బీజేపీ భరోసా కార్యక్రమం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పాండురంగారెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డబ్బుల వల వేసి.. మహిళల నగ్నఫొటోలు

- జడ్చర్లలో న్యూడ్ ఫొటోల గ్యాంగ్
- మహిళ ఫిర్యాదుతో ఆలస్యంగా వెలుగులోకి

జడ్చర్ల: హైదరాబాద్లో బాబా ఉన్నాడని మీ జాతకంతో కోట్లు సంపా దించొచ్చని ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న మహిళలకు ఆశచూపి కొలతల పేరుతో నగ్నంగా ఫొటోలు తీసి వ్యభిచార రంగంలోకి దింపుతున్న ఒకగ్యాంగ్ జడ్చర్ల పట్టణంలో హల్‌చల్ చేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. పోలీసులు స్థానికుల కథనం మేరకు వివరాలు.. ఈ నెల 18న పాత బజార్‌లోని ఓ మహిళ ఇంటివద్ద జైనుల్లాదీన్ అనే వ్యక్తి నీకు దేవుడు కరుణిస్తాడని నీ ఫొటోలు బాబాకు పంపిస్తే కోటి రూపాయలు వస్తాయని మాయమాటలు చెప్పి తలపై చేతిపెట్టగా ఆమె కళ్లుతిరిగి కిందపడిపోయిందని ఆ వ్యక్తి ఆమె ఒంటిపై ఉన్న వస్త్రాలు తొలగించి నగ్న ఫొటోలు తీసి వేరే వాళ్లకు పంపినట్లు గుర్తించారు. దీం తో ఆ మహిళ గొడవ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో తీగ లాగితే డొంక కదిలింది అన్నట్లుగా పోలీసులు విచారణ చేపడితే ఒకగ్యాంగ్ మహిళలకు డబ్బుల వలవేసి నగ్న ఫొటోలు తీసి వ్యభిచారం చేస్తున్నట్లు గుర్తించారు. ముందుగా ఈ గ్యాంగ్ గ్రామాల్లో మహిళలకు మీకు హైదరాబాద్‌లో ఒక గురువు (బాబా)ఉన్నారని ఆయన మీ ఒంటి కొలతలు ఫొటోలు తీసి పంపిస్తే జాతకం చూసి అన్ని బాగుంటే మీరు వెళ్లి బాబాను శారీకంగా కలిస్తే కోటి రూపాయలు కురుస్తాయని నమ్మబలుకుతారు. దీంతో మహిళలు కొందరు వీరి మాటలు నమ్మి తమ శరీర కొలతలు ఇవ్వడంతో పాటు నగ్నంగా ఫొటోలు దిగుతున్నట్లు తెలిసింది. ఇటీవల గ్యాంగ్‌లో ఒకరు డీల్ చేసిన మహిళ మరో వ్యక్తికి ఫొటోలు ఇవ్వడంతో ఇదంతా బయటికి వచ్చినట్లు పలువురు పేర్కొంటున్నారు. పోలీసులు విచారణ వేగవంతం చేయడంతో న్యూడ్ గ్యాంగ్‌లో సభ్యులుగా ఉన్న జైనల్లుద్దీన్, రాములు, శంకర్, కుంటి రాములును అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఘన నివాళి

నవ తెలంగాణ - మహబూబ్ నగర్

పట్టణ కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు అజ్మత్ అలీ ఆధ్వర్యం లో జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం మౌ లానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సం దర్భంగా పలువురు మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ ఆశయాలను కొనియాడారు. దేశంలో విద్యాభివృద్ధి కోసం మూలాన అజాద్ ఎంత గానో కృషి చేశారని అన్నారు. భారత దేశ తొలి విద్యాశాఖ మంత్రిగా భారత దేశంలో ఉన్న గ్రామస్థాయి వరకు విద్యను అందించడంలో కీల క పాత్ర పోషించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు అజ్మత్ అలీ, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీర్ ముహమ్మద్ సాదిక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లక్ష్మణ్ యాదవ్, ఎన్ ఎస్ యూఐ జిల్లా అధ్యక్షులు అవెజ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాయిబాబా, జన రల్ సెక్రెటరీ సీరాజ్ ఖాద్రీ, మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన వి కార్యదర్శి అజీజ్, వైస్ ప్రెసిడెంట్ తాహెర్, జహీర్, ఫహీం, ఫక్రు, అలీ, రాంచందర్, ముజీబ్,ఖాజా తదితరులు పాల్గొన్నారు.



రూ. 1.50 లక్షలతో మరికల్ బస్టాండ్

నవ తెలంగాణ -మరికల్

మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్‌ను బుధవారం ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి సందర్శించారు ఆయన మాట్లాడుతూ బస్టాండు మౌలిక సదుపాయాల కోసం రూ. కోటి యాభై లక్షలు మంజూ రైనట్లు తెలిపారు. అధికారులతో, ఆర్టీసీ బస్టాండ్ మండల స్థాయికి తగ్గట్టుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ పనులు రెండు నెలల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ ఆర్టీసీ నారాయణపేట అధికారులు, జెడ్పీచైర్మన్‌సురేఖ, సర్పంచ్ కె.గోవర్ధన్, మండల అధ్యక్షుడు లంబడి తిరుపతయ్య, బీఆర్ఎస్ నాయకులు రాజమూర్, కొండారెడ్డి, పట్టణ అధ్యక్షుడు సురిటి చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ రవికుమార్, కో-ఆప్షన్ నెంబర్ మతిన్, మోహన్ రెడ్డి, రామస్వామి, కానుగంటి నారాయణ, జిల్లా నాయకులు రాజవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.



హాత్ సే హాత్ జోడో స్టిక్కర్లను తొలగించడం దారుణం

- మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి



నవ తెలంగాణ -మహబూబ్నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రజల సమస్యలు తెలుసుకుని వారికి భరోసా నింపేందుకు కాంగ్రెస్ చేపట్టిన హాత్ సే హాత్ జోడో కార్యక్రమం సందర్భంగా ఇంటి యజమానులతో చర్చించి వారి గోడలకు తమ కార్యక్రమం స్టిక్కర్లు అతికిస్తున్నామని, అధికారులు, ఎమ్మెల్యే ఆదేశాలతో ఉపాధ్యాయ శాసనమండలి ఎన్నికలకోడ్ ఉందని వాటిని తొలగించడం దారుణమని మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ తమ పార్టీ గుర్తు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉండదని ఎన్నికల కోడ్‌కు సంబంధం లేకుండానే తమ కార్యక్రమం తమ స్టిక్కర్ ఉందని తెలిపారు. ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా పనిచేసిన తనకు ఎన్నికల నియమ నిబంధనలు తెలుసుకొని అధికారులు ఎవరి ఫిర్యాదు మేరకు తొలగించారని స్పష్టం చేయాలని ఎన్నికల కమిషన్ సంప్రదించి తొలగిస్తే బాగుండేదని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపో వడంతో ప్రజలలో ప్రభుత్వ ఉనికి కోల్పోయి ఇలాంటి చర్యలకు పూను కుంటు న్నారని కాంగ్రెస్ సహించదన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ గతంలో తమ అధికారంలో ఉన్న సందర్భంలో చేపట్టిన పథకాలను వివరిస్తూ ఉంటే కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున స్పందన లభిస్తుందని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి గుణపాఠం తప్పదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో పాఠశాలల నిర్మాణాలు, రహదారుల ఏర్పాటు విద్యుత్‌సబ్ స్టేషన్లు ఆరోగ్యశ్రీ 108 అంబులెన్సులు ఫీజురియంబర్స్మెంట్ పెన్షన్ల మంజూరు పై ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అర్థంరవి, నారాయణ గౌడ్, పాండు, వెంకటేష్, అర్జునయ్య, వాల్యానాయక్ పాల్గొన్నారు.

25న జెడ్పీ సమావేశం

నవ తెలంగాణ -మహబూబ్ నగర్

మహబూబ్ నగర్ జిల్లా పరిషత్ సమావేశం ఈనెల 25వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరుకావాలని కోరారు. అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ -గట్టు

శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ సోదరుడి కే.శే నర్సన్ గౌడ్ దశదిన కర్మ మండల పరిధి లోని ఆలూరులో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ హాజరై చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం శాట్స్ చైర్మన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్‌తోపాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రితో పాటు అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, వినియోగదారుల ఫోరం చైర్మన్ గట్టు తిమ్మప్ప, జెడ్పీ చైర్ పర్సన్ సరిత తిరుపతయ్య, ఉమ్మడి జిల్లా మాజీ జెడ్పీచైర్మన్ బండారి భాస్కర్, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు హనుమంతునాయుడు, వడ్డేపల్లి జెడ్పీటీసీ కాసపోగురాజు, బీఆర్ఎస్ నాయకులు వడ్డేపల్లి లక్మిరెడ్డి, వైస్ఎంపీపీ చంద్రన్నగౌడ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

23న పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

నవ తెలంగాణ - అచ్చంపేట రూరల్

ఈ నెల 23న పంచాయతీ కార్యదర్శులకు మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో నిర్వహించే ఒక్కరోజు శిక్షణా కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని అందరూ పంచాయతీ అధికారులు, కార్యదర్శులు విధిగా హాజరు కావాలని డివిజినల్ పంచాయతీ అధికారి కే. వెంకటయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణలో పన్ను విధింపు విధానం, వసూలు విధానం, పంచాయతీ రికార్డుల నిర్వహణ, జిపిడిపి తయారు చేసే విధానాలపై శిక్షణా ఉంటుందని తెలిపారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

నవ తెలంగాణ- ఊట్కూర్

మెనూ ప్రకారం పౌష్టికరం అందించాలని ఐసీడీఎస్ సూపర్వైజర్ గీత అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొత్తపల్లిలోని అంగన్వాడిసెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సెంటర్‌లోని పిల్లల విరాలను అడిగి తెలుసుకుని రిజిస్టర్‌ని పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ సెంటర్ పిల్లలు చేసే యాక్టివిటీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్వాడీ టీచర్‌ను పలు సూచనలు చేశారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

నవతెలంగాణ -మాగనూర్

మండంలోని మందిపాల్‌లో బుధవారం ప్రాథమికోన్నత పాఠశాలకు రూ. 40 వేల విలువగల టీవీని బీఆర్ఎస్ నేత విజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్ రెడ్డి బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యారంగానికి వీజేఆర్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేదవిద్యార్థుల కోసం నిరంతరం కృషిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తిమ్మన్న, ఉపాధ్యాయులు సరిత, పరమేశ్వరి, రాములు, ఎస్ఎంసీ చైర్మన్ కాసిం, సింగిల్ విండోడైరెక్టర్, గ్రామస్తులు అశోక్, వెంకటేష్, ఆశప్ప, నరసప్ప, ఆంజనేయులు, మంజు, చంద్రు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి : సీఐటీయూ జిల్లా కార్యదర్శి

కొత్తకోట : వనపర్తి జిల్లాల్లో కొనసాగుతున్న పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తకోట మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిస్ మెంట్ కు 8 సంవత్సరాలు గడిచిన వేతనాలు సవరించలేదని దీంతో దాదాపు కోటి మందికి పైగా కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని చెప్పారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్ ఎంప్లాయిస్మెంట్ లో కనీస వేతనాలు సవరించాలని ఫైనల్ నోటిఫికేషన్ ఇచ్చిన ఐదు రంగాలను గెజిట్ చేయా లని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలన్నారు. పెరుగుతున్న శాస్త్ర సాంకే తిక దృశ్య రోజుకు 7:00 వారానికి ఐదు రోజులు పని దినాలు ఉండాలని పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మండ్ల రాజు, ఉపాధ్యక్షులు ఎండీ మైముద్, బొబ్బిలి నిక్సన్, కార్యదర్శులు శ్రీహరి, ఆర్ఎస్ రమేష్, రాము పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



ఆత్మకూరు : విద్యార్థులకు సంక్రమిత , అసంక్రమిత వ్యాధులపై జిల్లా వైద్యాధికారి డా. రవిశంకర్ అవగాహన కల్పించారు. బుధవారం ఆత్మకూరు పట్టణ సమీపంలోని బాల కిష్టాపురంలోకస్తూర్బా బాలికల విద్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరిశుభ్రత పాటించాలని అన్నారు. విద్యార్థులు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యులు నిసార్అహ్మద్, టీం సభ్యులు, పాఠశాల ప్రత్యేక అధికారి శివలీల , మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు, సూపర్వైజర్లు , ఏ సురేందర్ గౌడ్, ఆశ వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పూర్తిచేయాలి

• రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి అశోక్ కుమార్



వనపర్తి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శి అశోక్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు , గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారులతో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద అర్హులైన కుటుంబాలకు పని కల్పిస్తూ ఉపాధి కల్పించనున్నట్లు వివరించారు. అర్హులైన వారిని గుర్తించి జాబ్ కార్డులు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలలో చేపట్టిన ఉపాధి హామీ పనులలో పనిచేస్తున్న కూలీలకు సకాలంలో కూలి డబ్బుల చెల్లింపులు చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులకు అనుమతులు పొందిన అనంతరం కూలీలకు పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లాలో ఎంపిక చేయబడిన పనులకు పాలనపరమైన అనుమతులు మంజూరు చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు . కొనసాగుతున్నటువంటి పనుల పురోగతిపై ఫోటోలను అప్లోడ్ చేయాలని అర్హులైన కూలీలకు మాత్రమే పనులు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ మాట్లాడుతూ జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని, మన ఊరు మనబడి కార్యక్రమం కింద పాఠశాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. పనులు వేగవంతం చేసే దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఏ నరసింహులు, రేణుక , సుల్తాన్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



నవతెలంగాణ - వనపర్తిరూరల్

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం వనపర్తి మండలం పెద్దగూడెంలో గొర్రెలకు నటల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత గొర్రెలు,పశువుల పెంపకానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని పేర్కొన్నారు. దేశంలోనే మాంసం ఉత్పత్తిలో తెలంగాణ ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇప్పటివరకు గొర్రెల పంపిణీకి రూ.12,000 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. ఏడు లక్షల మంది గొల్ల కురుమల కుటుంబాలకు లబ్ధి చేకూరిందన్నారు.50 ఏళ్లు నిండిన గొల్ల కురుమలకు పింఛన్లు ఇస్తున్నట్లు వివరించారు. ఏడాదికి నాలుగు సార్లు గొర్రెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వనపర్తి మండలం వెంకపల్లిలో రామాలయంలో ధ్వజస్తంభం, విగ్రహాల ప్రతిష్టాపనలో మంత్రి సతీమణి సింగిరెడ్డి వాసంతి పాల్గొన్నారు.

ప్రైవేటు ఉద్యోగుల సంక్షేమానికి కృషి ..

ప్రైవేట్ ఉద్యోగుల సంక్షేమం కోసం భారత రాష్ట్ర సమితి కృషి చేస్తుందని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. బుధవారం క్యాంపు కార్యాలయంలో ప్రైవేట్ ఉద్యో గుల సంఘం డైరీ ఆవిష్కరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి పాల్గొని మాట్లాడారు. దేశంలోని ప్రైవేట్‌సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు భారతరాష్ట్ర సమితి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్‌గౌడ్, రాష్ట్రకార్యదర్శి టంకరి శివ ప్రసాద్‌యాదవ్, మోహన్ నాయక్, జిల్లా అధ్యక్షులు చిన్నపాక చంద్రశేఖర్, జిల్లా ఉపాధ్యక్షులు గద్వాల్ సురేష్ , దారపు నాగరాజ్ , ప్రధాన కార్యదర్శి బంకల రవీందర్, హైదర్‌అలీ ,రవి యాదవ్,నరేష్, గంధంబాలరాజ్, మహిళావిభాగంజిల్లావర్కింగ్ ప్రెసిడెంట్ శైలజ, సుజాత ,భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలపై ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టాలి

• రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్



వనపర్తి రూరల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళి అమలు , తుది ఓటరు జా బితా, బ్యాలెట్ పేపర్ల వెరిఫికేషన్, నివే దికలు , సకా లంలో పంపించడంపై జిల్లా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు బుధవారం ఆయన హైదరాబాద్ నుంచి ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జిల్లాల కలెక్టర్లు ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహి ంచారు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటరుగా నమోదైన ఉపాధ్యాయుల వివరాలు ముఖ్యంగా ప్ర భుత్వ ప్రవేట్ టీచర్ల వివరాలను ఇంకా ఇవ్వవలసిన జిల్లాలలో తక్షణమే అప్లోడ్ చేయాలని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే సంబంధిత బృందాలు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాలెట్ పత్రాలకు సంబంధించి వెరిఫికేషన్ రిపోర్ట్ పంపిం చాలని, బ్యాలెట్ బాక్సులను నేరుగా కౌంటింగ్ కేంద్రానికి పంపించేవిషయమై ప్రత్యేక చొరవ తీసు కోవాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ తేజస్ నందు లాల్ పవార్ మాట్లాడుతూ ఓటర్లుగా నమోదైన ప్రభుత్వ,ప్రైవేటు ఉపాధ్యాయుల వివరాలను తక్ష ణమే అప్లోడ్ చేస్తామన్నారు. అదేవిధంగా ఇతర ఆదే శాలను పాటించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఏడు పోలింగ్ స్టేషన్లో ఉన్నట్లు తెలిపారు. ఈ కాన్ఫ్రెన్స్‌లో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీఓ పద్మా వతి ,తాహసీల్దార్ రాజేందర్‌గౌడ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

మాణిక్‌రెడ్డిని గెలిపించాలి



వనపర్తి రూరల్ : విద్యారంగం అభివృద్ధి చెందాలంటే టీఎస్ యూటీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని గెలిపించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నరసింహారెడ్డికోరారు. బుధవారం వనపర్తి పట్టణంలోని పలు విద్యాసంస్థలు పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు . పీజీ, డిగ్రీ మెన్స్ ఉమెన్స్ పాలి టెక్నిక్, మెడికల్ , ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, బాలికల ఉన్నత పాఠశా లలో ప్రచారం నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశా లలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మార్చి 13న జరగనున్న మహబూబ్నగర్ హైదరాబాద్ రంగారెడ్డి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలికి టీఎస్ యుటీఎఫ్ పాపన్న గారి మాణిక్య రెడ్డి పోటీ చేస్తున్నారని ఆయనకు మద్దతు ప్రకటించాలని కోరారు.ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమె తప్ప ఎలాంటి స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేయమని అన్నారు. సంఘాలకు అతీతంగా మాణిక్‌రెడ్డిని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి డీ. కృష్ణయ్య , కోశాధికారి ఎండీ హమీద్ , కే జ్యోతి ఎం కృష్ణయ్య, భగవంతు, వెంకటయ్య , రామన్ గౌడ్, నారాయణ , జితేందర్ గౌడ్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన



వనపర్తి రూరల్ : ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆర్టికల్చర్ రీసెర్చ్ ఆధ్వర్యంలో బెంగుళూరులో నిర్వహించిన జాతీయ ఉద్యాన పంటల మేళా సందర్శన నిమిత్తం ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ వనపర్తి జిల్లా నుంచి 25 మంది రైతులు మంగళవారం విజ్ఞాన యాత్రకు బయలుదేరారు. బుధవారం అక్కడ ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి పరిశీలించారు. పండ్ల మొక్కల్లో విడుదల చేయబడిన అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ రకాలను పరిశీలించి వాతావరణ అనుకూలత వ్యాధి నిరోధకత వంటి అంశాలను అక్కడి శాస్త్రవేత్తలతో చర్చించి సాంకేతిక పరమైన సలహాలు, సూచనలు పొందారు. ట్రేలలో నారు పెంపకం అం టూ విధానంలో కూరగాయల సాగు షేడ్ నెట్ల రకాలు వివిధ పంటలు వా టిని ఉపయోగించే విధానం కొమ్మ కత్తిరింపుల ద్వారా డ్రాగన్ ఫ్రూట్ పెంపకం పండ్ల మొక్కల్లో అంటు పద్ధతులు వివిధ రంగుల అరుదైన పూల మొక్కలు, సుగంధ ద్రవ్యాలు, తైలాలు, ఔషధ మొక్కలు , పండ్ల నుంచి జామ్ జెల్లీలు ఉత్పత్తి చేసే విధానాలు, ఉద్యాన పంటల్లో ఉపయోగించే యంత్రాలు, పనిముట్లు, వాటివాడుక విధానాలను తెలుసుకున్నారు. తెలం గాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున ఉద్యాన శాఖ ఏర్పాటు చేసిన స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచి చూపరుల దృష్టిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో రైతులతో పాటు ఉద్యానశాఖ అధికారులు ఎన్. సురేష్ , ఆర్ కృష్ణయ్యలు వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

అభివృద్ధిలో తెలంగాణ అగ్రగామి : మంత్రి



పెబ్బేరు : అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బుధవారం పెబ్బేరు మున్సిపల్ చైర్‌పర్సన్ ఎద్దుల కరుణశ్రీ సాయినాథ్ సహకారంతో 5వ వార్డ్ కౌన్సిలర్ గోపిబాబు అనుచర బృందం 100 మందికిపైగా వివిధ పార్టీల కార్యకర్తలు మంత్రిసమక్షంలో బీఆర్ఎస్‌లో చే రారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశం లోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రెండు పర్యాయాలు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంతో పాటు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కేసీఆర్‌కు దక్కిందన్నారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీలకు చెందిన అన్ని వర్గాల ప్రజలు పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీ అభివృద్ధిలో పాలుపంచుకునేందుకు స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతున్న ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకుతూ పట్టణ అభివృద్ధి, పార్టీ బలోపేతానికి తమ వంతు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పెద్దింటి పద్మా వెంకటేష్, ఎంపీపీ ఆవుల శైలజ కురుమూర్తి, మున్సిపల్ వైస్‌చైర్మన్ కర్రెస్వామి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, కౌన్సిలర్లు పద్మవేణు యాదవ్, గోపి బాబు ,చిన్న ఎల్లారెడ్డి ,మేకల ఎల్లయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు ,టౌన్ అధ్యక్షుడు దిలీప్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి ,జూదం వెంకటేష్ , మన్యం, మరికుంట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

వనపర్తి రూరల్ : వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఖిల్లా గణపురం మండలం ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి వెంకటేష్ చిన్నయ్య యాదయ్య మరో 20 మందిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు వనపర్తి మండలం పెద్దగూడెం తండాకు చెందిన టీఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణనాయక్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆయన నివాసానికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి బీముడు నాయక్ ,ఎంపీటీసీ ధర్మనాయక్ మండల యూత్ అధ్యక్షులు చిట్యాల రాము, మండల ఉపాధ్యక్షులు నారాయణ ,గ్రామ కమిటీ యూత్ అధ్యక్షుడు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్‌పుస్తకాల పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని రేచింతలలో మాజీ సర్పంచ్ కీర్తిశేషులు దివంగత మురళీధర్‌రావు జన్మదినం సందర్భంగా ఆయన కుమారుడు లక్ష్మణరావు స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటా తన తండ్రిపేరు మీదుగా విద్యార్థులకు సాయం చేసేందుకు నిర్ణయించుకున్నట్లు పేర్కొ న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సరోజ రాఘవేందర్, ఉప సర్పంచ్ కుమ్మరి నరసింహ ,బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు కుమ్మరి వెంకటన్న, జనరల్ సెక్రెటరీ నరసింహయాదవ్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు ప్రవీణ్ కుమార్ ,గ్రామపెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటినుంచి నట్టల నివారణ మందుల పంపిణీ


ఆత్మకూర్ : గొర్రెలు, మేకలకు నటల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం నుంచి ఈ నెల 28 వరకు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యులు శ్రీనివాసులు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాలలో ఈ కార్యక్ర మం నిర్వహించనున్నట్లు తెలిపారు.బుధవారం రేచింతల, తూంపల్లీ గ్రామాల్లో నటల నివారణ కార్యక్రమం నిర్వహించినట్లు వివరి ంచారు. డాక్టర్ కే రమేష్,జీవీఓ నిర్మల , ఇంద్రజ ,వీ ఏ సిరాజుద్దీన్, ఓఎస్ మహమూద్, గొర్రెల, మేకల పెంపకందారులు పాల్గొన్నారు.

అంధత్వ నివారణకు కృషి : చైర్‌పర్సన్



కొత్తకోట : అంధత్వ నివారణకు ప్రభుత్వం ప్రభుత్వం కృషిచేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ పొగాకు సుఖేషినీ విశ్వేశ్వర్ అన్నారు. బుధవారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో ఎమ్మార్సీ భవనం నుంచి కంటివెలుగు కార్యక్రమాన్ని..7,8,9 వార్డు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా శిశు మందిర్‌కు మార్చి జరుగుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ జయంతి,మున్సిపల్ కౌన్సిలర్లు రామ్మోహన్‌రెడ్డి, ఖాజా మైనోద్దీన్, సంధ్య, మన్యం యాదవ్, కో ఆప్షన్ సభ్యులు వసీంఖాన్, తహసీన్ వహీద్ అలీ, బీఆర్ఎస్ నాయకులు వినోద్ సాగర్, మున్సిపల్ హరితహారం ఉద్యోగి కృపయ్య, మున్సిపల్ శానిటేషన్ సూపర్వైజర్ వెంకటయ్య,ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



ఆత్మకూర్ : ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలోని ఒకటో వార్డు ఖానాపురం గ్రామం వద్ద వేస్తున్న సీసీరోడ్డు పనులను మున్సిపాలిటీ పాలకవర్గం బుధవారం పరిశీలించింది.ఈ సందర్భంగా నాణ్యత, ప్రమాణాలతో సీసీ రోడ్డు వేయాలని నిర్వాహకులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్, వైస్ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, కమిషనర్ రమేష్, వార్డు కౌన్సిలర్ చెన్నయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రవికుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా బీఆర్ఎస్ : కోటేశ్వర్‌రెడ్డి



కొత్తకోట : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ గామాధ్యక్షుడు కొటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం కొత్తకోట మండలం కనిమెట్ట గ్రామానికి చెందిన కావలి చంద్రశేఖర్ గత రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందడు. ఈ విషయంపై మాజీ వైస్ ఎంపీపీ గుంత మల్లేష్, గ్రామ అధ్యక్షుడు కొటేశ్వర్‌రెడ్డి చొరవ తీసుకుని పార్టీ సభ్యత్వం ఉండడంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి సమాచారం అందించారు. ఎమ్మెల్యే సూచన మేరకు ఎంపీపీ గుంత మౌనిక మల్లేష్ సహకారంతోహైదరాబాదులోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో చంద్రశేఖర్ భార్య సునీత చేతికి పార్టీ ఇన్సూరెన్స్ ఆర్డర్ కాపీని పార్టీ కార్యాలయం ఇన్‌చార్జి ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో కావలి కురుమన్న తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మదర్సా వార్షికోత్సవం



ఆత్మకూర్ : ఆత్మకూరు పట్టణంలోని జాతర మైదాన సమీపంలోని మదర్సా ఐ మాదుల్ (అరబీ పాఠశాల,) 22వ వార్షికోత్సవాన్ని మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త దివ్య సూక్తులను తెలంగాణ,ఆంధ్ర అరబిక్ స్కూల్ అధ్యక్షులు మౌలానా రహమాన్ మౌలానా, అహ్మద్ వజిత్ సాహెబ్, మౌలానా జుబేర్ అహ్మద్ ఖాన్, ప్రముఖ మౌలానాలు వివరించారు. ప్రతి ఒక్కరితో గౌరవంగా మెలగాలని అన్నారు. ఈ వార్షికోత్సవం రెండు సంవత్సరాలకు ఓ సారి నిర్వహించనున్నట్లు తెలిపారు. ఖురాన్ పఠనం పూర్తి చేసిన విద్యార్థులను సన్మానించారు. ప్రపంచశాంతి కోరుతూ ప్రార్థన నిర్వహిం చారు . వివిధ ప్రాంతాల ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

హామీలన్నీ నెరవేరుస్తాం : టీపీసీసీ ప్రధాన కార్యదర్శి

కొత్తకోట : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే హామీలన్నీ నెరవేరుస్తామని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. బుధవారం మదనాపురం మండలంలోని రామన్ పాడ్‌లో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ర్యాలీ చేపట్టారు.కాంగ్రెస్ పార్టీని ఆదరించి గెలిపిస్తే ఏఐసీసీ అధినేత రాహుల్ గాంధీ ఇచ్చిన హామీలన్ని నెరవేరుస్తామని సూచించారు. గ్యాస్ సిలిండర్ ఐదువందలకు, రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణ మాఫీ చేస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో రామన్‌పాడ్ వాసులు గోసలు పడుతున్నారన్నారు.కార్యక్రమంలో టీపీసీసీ మైనారిటీ కార్యదర్శి అంజాద్ అలీ, టీపీసీసీ ఓబీసీ ఉపాధ్యక్షులు తీసి శ్రీనివాస్, వనపర్తి జిల్లా బీసీసెల్ ఉపాధ్యక్షులు రామచంద్రయ్య, మదనాపురం ఓబీసీ మండల అధ్యక్షుడు ఆవుల రాఘవేంద్ర యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరోత్తం రెడ్డి, రామన్ పాడ్ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖాదీర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రావణ్ కుమార్‌రెడ్డి, దుప్పల్లి రవీందర్‌రెడ్డి, సాయన్న గౌడ్,నెల్విడి యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



జిల్లా కార్యదర్శిగా నవీన్



కొత్తకోట : తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగుల సంఘం వనపర్తి జిల్లా కార్యదర్శిగా కొత్తకోటకు చెందిన గాడిల నవీన్ ఎన్నికయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గంధం రాములు నియమిస్తూ నియామక పత్రాన్ని జారీ చేశారు. అందుకు సంబంధించిన నియామక పత్రాన్ని తెలం గాణ రాష్ట్ర వ్యవసాయ సహకార శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేతు ల మీదుగా అందుకున్నారు. జిల్లాలో ప్రైవేట్ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వందృష్టికి తీసుకురావాలన్నారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి, ప్రైవేట్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంధం రాములుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సమాజహితమే నామతం

• నేపాల్ సైకిల్ యాత్రికుడు రాజ్ కుమార్

నవతెలంగాణ- తెలకపల్లి

సమాజహితమే నా మతం అని అంతరాలు లేని ఆధ్యాత్మిక భావనతో శాంతియుత జీవనం, సమాజాభివృద్ధి సాధ్యమని నేపాల్ రాష్ట్రానికి చెందిన సైకిల్ యాత్రికుడు రాజ్ కుమార్ అన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 8 నెలలుగా సైకిల్ యాత్ర చేపట్టిన రాజ్ కుమార్ సైకిల్ యాత్రలో భాగంగా శ్రీశైలం జ్యోతిర్లింగ దర్శనానికి బుధవారం మండల కేంద్రానికి చేరుకోవడంతో తెలకపల్లి మండల సింగిల్ విండో వైస్ చైర్మన్ మామిళ్ళపల్లి యాదయ్య, క్రాంతి హోటల్ నిర్వాహకులు రాజ్ కుమార్‌కు స్వాగతం పలికి అల్పాహారం, పండ్లు పంపిణీ చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ ఎం యాదయ్యతోపాటు రాధాకృష్ణ, స్టాలిన్, శంకర్, గోపి, ఈశ్వర్, సుధాకర్, రాము, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పర్వతాపూర్‌లో హైమాక్స్ లైట్ల ప్రారంభం

నవతెలంగాణ- తెలకపల్లి

ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి నిధులతో బుధవారం మండల పరిధిలోని పర్వతపురలో 3 హైమాక్స్ లైట్లు ప్రారంభించినట్లు సర్పంచ్ జనంపల్లి లక్ష్మమ్మ తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సహక రించిన ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఈశ్వరమ్మ, వార్డుసభ్యులు రాములు, గ్రామ నాయకులు లింగస్వామి, పర్వతాలు, సైదులు గౌడ్, రేనయ్య శివ, జంగయ్య పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం

నవ తెలంగాణ- తాడూర్

మండల పరిధిలోని ఇంద్రకల్‌లో బుధవారం కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటరమణ ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొని కంటి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మెన్ సమద్‌పాష, ఎంపీటీసీ సబిత, ఉపసర్పంచ్, వార్డ్‌సభ్యులు, సెక్రటరీ భాస్కర్, డాక్టర్ ఇస్మాయిల్, రాజేశ్వరి సిబ్బంది శ్రీనివాసులు, మాధురి, పారిజాత, సుమిత్ర, శారద, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ టీకాలు వేయించాలి

కందనూలు: జిల్లా కేంద్రంలోని అన్నిగ్రామాల్లో నేటినుంచి నిర్వహించే ఉచిత నట్టల నివారణ మందుల కార్యక్రమాన్ని గొర్రెలు, మేకల పెంపకందార్లు ఉపయో గించుకొని వారి మందలకు నట్టల నివారణ టీకాలు చేయింకోవాలని జిల్లా పశువైద్య పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జీవీ రమేష్ కోరారు. మండ లంలోని రాగాయిపల్లి, పలుగుతండ, చౌదర్‌పల్లి, శంకర్కొండ తండ గ్రామా ల్లో నట్టల మందు పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కా ర్యక్ర మంలో సర్పంచులు అచ్చాలు, గాలమ్మ, కోమ్లీ, బక్యానాయక్, ఎంపీటీసీ మో తిలాల్ నాయక్, మండల పశువైద్య అధికారి డాక్టర్ శ్యాంసుందర్, సిబ్బంది నరేష్‌రెడ్డి, నరసింహ, ఫణిందర్ రెడ్డి, శ్రీనివాసులు, తిరుపతయ్య, మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - తిమ్మాజీపేట

ప్రభుత్వ పథకాల్లో భాగంగా ప్రభుత్వం అందించే గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందులు తప్పనిసరిగా తాపించాలని మండల పశు వైద్యాధికారి శ్రావణి అన్నారు. బుధవారం మండలంలోని మరికల్, రాళ్లచెరువు తండా గ్రామాల్లో పశువైద్యాధికారి తమ సిబ్బందితో నేరుగా మందల వద్దకు వెళ్లి 3601, గొర్రెలు, మేకలకు నివారణ మందులను తాపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముందస్తుగా వచ్చే వ్యాధులను నివారించడానికి తప్పనిసరిగా ఈ మందును తాపించాలన్నారు. ప్రభుత్వం గొర్రెలు మేకలకు సీజనల్ వ్యాధుల నివారణను దృష్టిలో ఉంచుకొని శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, నరేష్, గోపాలమిత్ర స్వామి, మన్మథచారి తదితరులు ఉన్నారు.

కోడేరు : తెలంగాణ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ప్రతి సంవత్సరం రెండు సార్లు ప్రతిష్టాత్మకంగా గొర్రెలకు, మేకలకు ఉచిత నట్టల నివారణ కార్యక్రమం చేపడుతుంది. ఈ కార్యక్రమంలో భాగంగా బుధవారం కోడేరు గ్రామంలో గొర్రెలకు మరియు మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు పశువైద్యాధికారి డాక్టర్ భాను కిరణ్ వేశారు.నట్టల మందులు త్రాపించడం వలన గొర్రెలు మేకల శరీరంలో అనగా కడుపులో, దొబ్బలో, కార్జంలో, మెదడులో ఉండే నట్టలు మరణించి గొర్రెలు మరియు మేకలు ఆరోగ్యకరంగా బలంగా అవుతాయి. కావున గొర్లకాపర్లు మరియు రైతులు ఈ యొక్క మందులను త్రాగించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు. ఈరోజు నుండి ప్రతి రోజు ఒక్కో గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వి. ఏ. రజిత, అటెండర్ మూర్తి పాల్గొన్నారు.

చిరంజీవి రిత్వికను దీవించిన మాజీ మంత్రి జూపల్లి

నవతెలంగాణ -పెద్దకొత్తపల్లి

మండలం మరెడు మాన్‌దిన్నె గ్రామానికి చెందిన బొల్లం పావని నవీన్ సూర్య ప్రతాప్ గౌడ్ ప్రధాన అనుచరుడు ఆహ్వానం మేరకు ఆయన కూతురు చిరంజీవి రిత్విక మొదటి పుట్టినరోజు వేడుకలల్లో ముఖ్యతిథిగా మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మండల ఎంపీపీ సూర్య ప్రతాప్ గౌడ్ హాజరై చిరంజీవి రిత్వికను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడుచిన్న బాలస్వామి, సర్పంచ్‌లు లిసత్యం, పి.చిన్నయ్య, సునీత, వెన్నచర్లఎంపీటీసీరవికుమార్, మాజీ సర్పంచ్ బాల్‌నాయక్, మాజీ ఎంపీటీసీ, వెంకటస్వామిగౌడ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, యువ నాయకులు చంద్రశేఖర్, రాకేష్, బాలింగచారి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

నవ తెలంగాణ -నారాయణపేట టౌన్

జిల్లా కేంద్రంలోని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథ పార్టీ కార్యాలయంలో బుధవారం మైనార్టీలకు డబుల్‌బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎంఎల్ ప్రజాపంథ పార్టీ కార్యాలయంలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మైనార్టీ సాధన సమితి అధ్యక్షుడు సాదిక్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా సమావేశానికి ముఖ్యఅతిథులుగా ప్రజాపంథ నాయకులు కాశీనాథ్ హాజరై మాట్లాడుతూ.. పట్టణ శివారులోని మైనారిటీలకు కేటా యించిన స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశా రు. సర్వేనెంబర్ 67, 48 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు 1000 మందికి స్థలాలు ఇచ్చరని అన్నారు. ఆ స్థలంలో డబుల్ బెడ్రూం ఇండ్లు నిర్మించాలన్నారు. మైనార్టీలకు డబుల్ బెడ్రూం ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత

నవ తెలంగాణ -ఊట్కూర్

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్ని పాఠశాలలో నిర్వహించిన ఇంగ్లిష్ స్పెల్లింగ్ టెస్ట్ మండల పరిధిలోని నిడుగుర్తిలోని ఎంపీ యూపీఎస్ పాఠశాలలో విజయవంతంగా నిర్వహించారు. 4నుంచి 8వ తరగతి విద్యార్థులందరూ పాల్గొని ఇంగ్లిష్ పదాలు వాటికి అర్థాలు రాశారు. అనంతరం మూల్యాంకనం చేసి తరగతివారీగా విజేతలకు బహుమతులు ప్రధానం చేసినట్లు ప్రధానోపాధ్యాయులు లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, వెంకటప్ప, సుజాత, సలాం, లియాకత్, ఆంజనేయులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పప్పుశనగ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి: సీపీఎం



ఉండవల్లి: పప్పుశనగ పంట పండించిన రైతులకు అనుకూలమైన ప్రాంతంలోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి అన్నారు. బుధవారం అలంపూర్ చౌరస్తాలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రధా నంగా వర్షాధారంగా పప్పుశనగ పంట పండుతుందని, ఈ సంవత్సరం వాతావరణం అనుకూలించినప్పటికీ మంచి దిగుబడి వచ్చినప్పటికీ అధికా రులు, నాయకుల మధ్యన సమన్వయంలోపం వల్ల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంలో ఉదాసీనత వ్యవహరిస్తున్నారని వారు మండిపడ్డారు. పండిన పంటను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసేవిధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగరాజు, మద్దిలేటి, ఏదన్నా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
నాగర్‌కర్నూలు
3
గురువారం 23 ఫిబ్రవరి 2023

సీసీ రోడ్డు పనుల ప్రారంభం



నవతెలంగాణ - తిమ్మాజిపేట

మండలంలోని ఇప్పలపల్లిలో బుధవారం ఉపాధిహామీ పథకం నిధులతో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీపీరవీంద్రనాథ్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మణెమ్మ భూమిపూజచేసి పనులను ప్రారంభించారు. ఉపాధిహామీపథకం నిధులనుంచి రూ. 10 లక్షల సీసీ రోడ్డు పనులను చేపట్టారు. సీసీరోడ్ల నిర్మా ణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డికి సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగుప్రదీప్, ఉపసర్పంచ్ అనిత, ఏఈ రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి పర్వతాలు, నాయకులు గోసంగి రాములు, పాండురంగారెడ్డి, శ్యాం భాస్కర్‌రెడ్డి, వార్డు సభ్యులు కాలనీవాసులు ఉన్నారు.

వరి ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేయాలి

• అదనపు కలెక్టర్ ఎస్. మోతీలాల్

నవ తెలంగాణ - కందనూలు



జిల్లాలో రైతులు ఎండాకాలంలో పండించిన వరి ధాన్యాన్ని ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందని నాగర్ కర్నూల్ జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్ మోతీలాల్ అన్నారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని తన చాంబర్లో సహకార, మార్కెటింగ్, వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులు మిల్లర్లతో జిల్లా వరి కొనుగోలు కమిటీ సమావేశాన్ని అదనపు కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో రైతులు లక్ష 33 వేల ఎకరాల్లో ఎండాకాలం వరి సాగు చేసినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ అధికారుల అంచనా ప్రకారం 3 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసే లక్ష్యంగా జిల్లాలో వరి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 233 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జిల్లా ప్రాథమిక సహకార సంఘాల ద్వారా 215 కొనుగోలు కేంద్రాలు, ఐకేపీ ద్వారా 15, మెప్మా ద్వారా మూడు కొనుగోలు కేంద్రాలు అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే వారి ధాన్యంలో తేమశాతం 14 మించకుండా తీసుకురావాలన్నారు. ఏ గ్రేడు ధాన్యం రూ.2060, బీ గ్రేడ్ ధాన్యం రూ.2040గా ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఆయా కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన పరికరాలు, తూకం మిషన్లు, టార్పాలిన్ కవర్లు ఏర్పాట్లు చేయాలన్నారు. ఇప్పటికే 53 లక్షల గన్ని బ్యాగులు జిల్లాలో 60శాతం గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయన్నారు. మిగిలిన 33 లక్షల గన్నీ బ్యాగులను సమకూరుస్తామన్నారు. జిల్లాలో నాలుగు గోదాములు 109 మిల్లులు ఉన్నాయని, ఎవరైతే మిల్లర్లు ఎఫ్ సీఐ కి సీఎంఆర్ బియ్యాన్ని వందశాతం అందజేశారో వారికి మొదటి ప్రాధాన్యత ఇచ్చి వారికి అందించాలన్నారు. ఎవరైతే మిల్లర్లు సీఎంఆర్ అందించడంలో విఫలమయ్యారు వారికి వడ్లను అందించకూడదని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు లారీల ద్వారా తరలించేందుకు జిల్లాలో 4 ఏజెన్సీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఒక్కో ఏజెన్సీకి 25 లారీలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే ఆర్టీవో ద్వారా వాహనాలు ఏర్పాటు చేసి ఎంపిక చేసిన మిల్లులకే వరి ధాన్యం తరలించేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేలా జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మిల్లర్లు తమ సొంత వాహనాల్లో వరి ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి వీలు లేదన్నారు. అలా చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి మోహన్ బాబు, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రాథమిక సహకార అధికారి పత్యా నాయక్, సివిల్ సప్లై డీఎం బాల్రాజ్, మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ బాబు, కార్యదర్శి రవి, ట్రెజరర్ నవీన్ కుమార్, ఏడీ కనకరాజు, మెప్మా మేనేజర్ రాజేష్, డీఆర్‌డీఏ మార్కెటింగ్ సివిల్ సప్లై తదితర శాఖల అధికారులు, మిల్లర్లు , సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

•రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్ రాజ్

నవతెలంగాణ- కందనూలు



ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని రాష్ట్ర ఎన్ని కల ప్రధానాధికారి వికాస్‌రాజ్ జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. బుధవారం మధ్యాహ్నం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. గురువారం ఎలక్టరోల్ తుది జాబితా విడుదల చేయడం జరుగుతుందని, ఇంకా ఎపిక్ కార్డులు తీసుకొని వారి నుంచి సేకరణ ప్రక్రియ పూర్తిచేయాలన్నారు. ప్రైవేట్ టీచర్లు, ప్రభుత్వటీచర్ల మార్కింగ్ ప్రక్రియ పూర్తిచేసి సీఈవో పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ఉండాలని సూచించారు. ఏమైనా ఫిర్యాదులు వస్తే పరిశీలించి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన బ్యాలెట్ బాక్సులు సిద్ధంచేసి పెట్టుకోవాలని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో 14పోలింగ్ స్టేషన్లుఏర్పాటు చేసినట్లు, వాటికి అవసరమైన బ్యాలెట్‌బాక్స్‌లు సిద్ధంచేసి ఉంచినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనలకు అనుగుణంగా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆదనపుకలెక్టర్ మను చౌదరి, ఆదనవు కలెక్టర్ రెవెన్యూ మోతిలాల్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి

• ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి

నవ తెలంగాణ -కందనూలు



లంబాడాల పూజ్య గురువు సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ చూపిన సన్మార్గం ప్రతి ఒక్కరికీ ఆచారణీయమని ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి అన్నారు. బుధవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని లాహిరి గార్డెన్ ఫంక్షన్ హాల్లో సేవాలాల్ మహరాజ్ 284 వ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిన భోగ్ భాండారా కార్యక్రమంలో శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి సహనం, అబద్ధాలు అడకూడదు, జీవ హింస, మత్తుపానియాలు చేయరాదని అనే చాలా ముఖ్యమైన సందేశాలను ఇచ్చారని కొనియాడారు. లంబాడా ప్రజలకు మంచిని ప్రచారం చేస్తూ జ్ఞానం పెంపొందించుకోవాలని బోధిస్తూ దేశ సంచారం చేశారని వారు చూపిన మార్గానిర్దేశాలు సమాజంలోని ప్రతి ఒక్కరూ పాటించదగినవే అని తెలిపారు. సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడవాల ని ఉద్బోదించారు.అంతకు ముందు నాగర్ కర్నూల్ పట్టణంలోని ప్రధాన రహదారి గుండా బంజారా గోర్ భాయి సోదరులు, మహిళలు సేవాలాల్ మహరాజ్ ఊరేగింపు ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీచైర్మన్ శాంతాకుమారి, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, బంజారా నాయకులు పాల్గొన్నారు.

పండిట్స్, పీఈటీ కోర్టు వివాదాన్ని ప్రభుత్వమే పరిష్కరించాలి

• టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె. జంగయ్య

నవతెలంగాణ - తిమ్మాజీపేట



అప్ గ్రేడ్ అయిన పండిత్, పీఈటీల కోర్టు వివాదాన్ని ప్రభుత్వమే పరిష్కరించి పర్మిషన్‌ను ఇవ్వాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కే జంగయ్య డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల క్యాంపియన్‌లో భాగంగా బుధవారం తిమ్మాజీపేట్, పోతిరెడ్డిపల్లి, గొరిట, చేగుంట, మరేపల్లి, అవాంచ గ్రామాల్లో ఉన్న జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను, అలాగే మండలంలో ఉన్న కేజీబీవీ పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయులనుదేశించి మాట్లాడారు.. ప్రభుత్వ విద్యారంగ సంక్షేమమే టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన ఎజెండాగా టీఎస్ యూటీఎఫ్ మానిక్ రెడ్డిని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దింపిందని రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అన్నారు. ఈ మార్చి 13న జరుగనున్న మహబుబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీలో ఉన్న టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన అభ్యర్థిపాపన్నగారి మాణిక్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. విద్యారంగంపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తి అని శాసన మండలికి ఎమ్మెల్సీగా ఎన్నికైతే మరిన్ని సమస్యల పరిష్కారం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పండిత్ పీఈటీల అప్గ్రేడేషన్, కోర్టుల్లో ఉన్న వివిధ అంశాలపై జోక్యం చేసుకుని త్వరగా పదోన్నతులు బదిలీల ప్రక్రియ పూర్తయేలా చొరవ చూపాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు వహిద్‌ఖాన్, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ నసీర్, ఎం శ్రీనివాస్, ఎండీ సమీర్, లక్ష్మణ్, లక్ష్మీపతి, ఆర్ హారిక తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

• మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి

నవతెలంగాణ- తెలకపల్లి

కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో నిరుపేదవర్గాలకు సంక్షేమపాలన సాధ్యమని మాజీ మంత్రి రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాగంజనార్దన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని గట్టు రాయపాకులలో "హాత్ సే హాత్ జోడో అభియాన్" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.. నియోజకవర్గానికి వివిధ రకాల అభివృద్ధి సంక్షేమ ఫలాలు తీసుకొచ్చానని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా వారిచ్చిన స్ఫూర్తితో రాష్ట్ర అధ్యక్షుడు ఏనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో పాదయాత్ర కొనసాగుతున్న తరుణంలో వారినీ ఆదర్శంగా తీసుకొని గడపగడపకు తిరుగుతూ ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, పెరిగిన ధరలను, నిత్యవసర సరుకులను తగ్గించి సంక్షేమ పరిపాలన చేసుకునే విధంగా రేపు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడితే చక్కటి పరిపాలన అందిస్తుందని, కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగం శశిధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నారాయణగౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం బాల గౌడ్, అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, కాంగ్రెస్ టీపీసీసీ సభ్యుడు జిల్లా నాయకులు, మండలనాయకులు తదితరులు పాల్గొన్నారు.

వంగూరు: హత్ సే హత్ జోడో అభియాన్ యాత్ర కార్యక్రమంలో బుధవారం వంశీకృష్ణ పాల్గొని రంగాపూర్‌లో వీధిలో, వాడల్లో, ప్రతి గడప గడపకు తిరిగి.. ఇందిరమ్మ రాజ్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న పాలన విధానాన్ని గ్రామ పెద్దలతోచర్చిస్తూ సమస్యలను అడిగి తెలుసుకుంటు న్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేసిన అభివృద్ధి పనులు మన పట్టణంలో మనగ్రామాల్లో మన తాండాలలో కనబడుతుందని, ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పండిత్ రావు, రాజు, ఉప సర్పంచ్ శ్రీను, నాగరాజు, పాండు, శంకర్, బాబా, జనార్ధన్, రాజురెడ్డి, అచ్చంపేట మండల అధ్యక్షుడు నరసయ్యయా దవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ బుచ్చి రాములు, అంతటి మల్లేష్, భరత్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్ బాయ్ పాల్గొన్నారు.



తెలంగాణ ఉద్యమంలో అల్లం పద్మ పాత్ర గొప్పది

• టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షులు ఎం. చంద్రశేఖరరావు



నవతెలంగాణ- కందనూలు

మలిదశ తెలంగాణ ఉద్యమంలో అల్లం పద్మ పాత్ర గొప్పదని టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షు డు ఎం చంద్రశేఖరరావు, తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టుల సంఘం తెలంగాణ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు శేఖర్‌ఆచారి అన్నారు. బుధవారం మీడియా అకాడమీ చైర్మన్ అల్లంనారాయణ సతీమణి అల్లంపద్మ మొదటి వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి పూలమాలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన ఉద్యమకారుల తల్లిదండ్రులకు బాసటగా నిలుస్తూ"అమ్మల సంఘం" ఏర్పాటుచేసి వారిలో మనోధైర్యాన్ని కల్పిస్తూ ఉద్యమ స్ఫూర్తిని రగిల్చిన ధీర వనిత అల్లం పద్మ అని అన్నారు. ఇలాంటి గొప్పవారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు సాయిలు, సాగర్, సాజిద్‌లతోపాటు ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరిపించాలి

నవ తెలంగాణ -కందనూలు

ఉపాధిహామీ పనుల సోషల్ ఆడిట్ పెరాలపై సమగ్ర విచారణ చేయించి తప్పులు జరిగినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ అన్నారు. బుధవారం సోషల్‌ఆడిట్ పెరాల పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్, సుల్తానీయ, జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, డీపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన సోషల్ ఆడిట్ పెరాల డ్రాపవుట్‌పై పునఃసమీక్షించి అవసరమైన వాటికి స్పీకింగ్ ఆర్డర్ ఇవ్వడం, రికవరీ చేయడం, బాధ్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదనవు కలెక్టర్ మనుచౌదరి, డీఆర్‌డీవో నర్సింగ్‌రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ

నవతెలంగాణ- తాడూరు

మండల పరిధిలోని తుమ్మల సుగుర్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం రూ. 50వేలు విలువగల టీవీని క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాస రాఘవేందర్‌రెడ్డి పాఠశాలకు అందజేసినట్లు తెలిపారు. అదేవిధంగా రానున్న కాలంలో క్లాస్మేట్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు ఇంకా ఎంతో ఉపయోగకరమైన మెటీరియల్ అందజేస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున్, ఉపాధ్యాయులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న క్లాస్మేట్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్ రెడ్డి, క్లాస్మేట్ క్లబ్ సభ్యులను దాత మిరియాల నవీన్ కుమార్‌ను పాఠశాల తరపున ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బావిలో పడి మహిళా మృతి

నవతెలంగాణ - తిమ్మాజిపేట

మండల పరిధిలోని గొరిట గ్రామానికి చెందిన ఎల్లమ్మ 47 అను మహిళా బావిలో పడి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్సై శంషోద్దీన్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన అభిరెడ్డిపల్లి రాములు భార్య ఎల్లమ్మ మూడు రోజుల క్రితం పుట్టింటికి వెళ్తానని చెప్పి వెళ్లిందని తీరా బుధవారం బావిలో శవం ఉన్న విషయాన్ని సమీప పొలంలోని ఓ రైతు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. విషయం తెలుసుకున్న భర్త అక్కడికి వెళ్లి చూడగా తన భార్య నీటిలో శవమై తేలిందని గుర్తుపట్టి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని విచారణ జరిపి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని జడ్చర్ల ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై షాంషోద్దీన్ తెలిపారు.

దళితబంధు కింద మంజూరైన పరిశీలించిన ఎంపీడీవో

తిమ్మాజిపేట : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన దళితబంధు పథకంలో లబ్ధిపొందిన షాపులను ఎంపీడీవో కరుణాశ్రీ బుధవారం పరిశీ లించారు. దళితబంధు లబ్ధిదారుల వ్యాపార వివరాలను మొబైల్ యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఆదేశాలతో మండలంతోపాటు పోద్దిరెడ్డిపల్లి గ్రామాలకువెళ్లి దళితబంధు మొబైల్ యాప్‌లో లబ్ధిదారుల ఫొటోలు తదితర వివరాలను సేకరించి మొబైల్ యాప్‌లో నమోదు చేశారు.

కొనసాగుతున్న కంటి వెలుగు

నవతెలంగాణ -గట్టు

మండలంలోని కంటి వెలుగు రాయపురం మిట్టదొడ్డిలో నిర్వహించారు. అందులో భాగంగా ఓపీ 304మందిని పరిశీలించారు. రీడింగ్ గ్లాస్‌కోసం 9మందిమందికి ఆర్డర్ పంపినట్లు సీహెచ్ హుస్సేన్ తెలియజేశారు. ఈ క్రమంలో తిమప్ప హెల్త్ సూపర్వైజర్ మక్సుద్, ఏఎన్ఎం నర్మద, తాయేరియ డాక్టర్ నరేష్, స్వర్ణలత, ఆశాలు పాల్గొన్నారు

క్షేత్రస్థాయి ప్రదర్శన

నవతెలంగాణ - తిమ్మాజిపేట



ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పాలెం ఆధ్వర్యంలో బుధవారం భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం సంస్థ హైదరాబాదు వారి సహకారంతో మండలంలోని రాళ్లచెరువు తండా, ఆవంచలో గిరిజన రైతులు ఆముదంలో ఐసిహెచ్-66 రకాలను హైబ్రిడ్లను పండించారు. ఈ సందర్భంగా హర్యానాయక్ పొలంలో క్షేత్రస్థాయి ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శన దినోత్సవం సందర్భంగా భారతీయ నూనె గింజల పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ డైరెక్టర్ ఆర్ కె మాతుర్ రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రైతులందరూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు అధిక లాభం పొందే విధంగా రైతులు ఒక గ్రూప్ గా ఉండి నూతన సాంకేతికను పంటలలో పాటించాలన్నారు. డాక్టర్ కే సురేష్ మాట్లాడుతూ రైతులకు గిరిజన ఉప ప్రణాళిక పథకం పైన అవగాహన కల్పించి రైతులను ప్రోత్సహించే ఉద్దేశంతో విత్తనంతో పాటు నూతన వంగడాలను నూతన సాంకేతికతను అందిస్తామన్నారు. డాక్టర్ ఆర్ డి ప్రసాద్ మాట్లాడుతూ వానాకాలం కాకుండా యాసంగిలో బూజు తెగులు వచ్చే అవకాశం లేదని అధిక దిగుబడులను పొందవచ్చు అని తెలిపారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం నుండి డాక్టర్ సుజాత నూనె గింజల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పి వెంకటేశ్వర్లు శాస్త్రవేత్త డాక్టర్ నాలిని డాక్టర్ సదయ్య డాక్టర్ ఈశ్వర్ రెడ్డి డాక్టర్ మధు ఏడిఏ రమేష్ బాబు వ్యవసాయ అధికారి కమల్ కుమార్ వ్యవసాయ విస్తరణ అధికారులు సాయిరాం శివ రైతులు తదితరులు పాల్గొన్నారు.